# ఎర్రగుంట చెరువును సర్వే చేసి ఎఫ్‌టీఎల్ హద్దులు నిర్ణయించాలి

## సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు



**పాల్వంచ, జూన్ 15 (తెలంగాణ వాణి)** ఎర్రగుంట చెరువును కబ్జాదారుల నుంచి కాపాడి గ్రామాన్ని రక్షించాలని కోరుతూ ఎర్రగుంట రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆరో రోజుకు చేరుకున్నాయి. శనివారం దీక్షలను ప్రారంభించిన సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, భౌతికంగా చెరువు, తూములు, అలుగు కనిపిస్తున్నా ప్రభుత్వ యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చెరువు ఉందని నివేదికలు ఇస్తూనే రికార్డుల్లో లేదని చెబుతూ ద్వంద వైఖరి అవలంబిస్తున్నారని ఆయన మండిపడ్డారు. భౌతికంగా ఉన్న చెరువు రికార్డుల్లో మాయం కావడం అధికారుల మాయాజాలమేనని, ఇది కబ్జాదారుకు కొమ్ముకాయడమేనని ఆరోపించారు. తన వ్యవసాయ భూమి అని ప్రెస్‌మీట్లు పెట్టే కబ్జాదారు సర్వేకు ఎందుకు అంగీకరించడం లేదని ప్రశ్నించారు. వ్యవసాయం చేయనీయడం లేదని కల్లబొల్లి కబుర్లు చెప్పే వ్యక్తి సర్వే చేయించి తన భూమిని తేల్చుకోవాలని సవాల్ విసిరారు.అబద్ధపు కాగితాలతో రైతుబంధు కింద లక్షల రూపాయలు పొందిన సదరు వ్యక్తిపై క్రిమినల్ కేసులు పెట్టి అక్రమంగా పొందిన డబ్బును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. చెరువును గ్రామస్థులకు అప్పగించే వరకు సీపీఎం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చెరువును కాపాడేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో పాటు ముఖ్యమంత్రిని కూడా కలుస్తామని తెలిపారు. రైతుల పోరాటానికి సీపీఎం ప్రత్యక్ష భాగస్వామిగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దొడ్డా రవికుమార్, పట్టణ కార్యదర్శి పి. తులసీరాం, కార్యదర్శివర్గ సభ్యురాలు వి. సత్యవాణి, కమిటీ సభ్యులు వి. రాములు, గ్రామస్థులు ఎం. వరప్రసాద్, ఇ. నాగభూషణం, వి. నాగ సత్యనారాయణ, ఎం. సత్యనారాయణ, ఎం. వెంకన్న, సత్యం, ఎల్లయ్యతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు

# సీసీటీఎన్ఎస్ 2.0 కేసులు సకాలంలో అప్లోడ్ చేయాలి

## వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలి

## నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు




**కొత్తగూడెం, జూన్ 15 (తెలంగాణ వాణి)** సీసీటీఎన్ఎస్ 2.0 పరిధిలో నమోదవుతున్న కేసుల దర్యాప్తు పురోగతిని నిర్దేశిత కాలపరిమితిలో ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ హెడ్క్వార్టర్స్‌లో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా పోలీసు అధికారుల ఆయన వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైనందున స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలతో సమన్వయం పాటించాలని సూచించారు. గంజాయి, మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి నివాస ప్రాంతాలు, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్ వంటి కారణాలతో జరిగే రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు నిరంతర వాహన తనిఖీలు చేపట్టి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్‌తో పాటు జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తగూడెం ఏరియాలోని సివిల్ డిపార్ట్ సమస్యలను పరిష్కరించాలి

## ఐఎన్టియుసి ఉపాధ్యక్షులు ఎండి రజాక్

## హెచ్ఓడి, డివైఎస్ఈ లకు వినతి పత్రం అందజేత



**కొత్తగూడెం సింగరేణి, జూన్ 15 (తెలంగాణ వాణి)** ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియాలోని సివిల్ డిపార్ట్మెంట్ లో నెలకొని ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏరియా ఐఎన్టియుసి ఉపాధ్యక్షులు యండి రజాక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏరియాలోని హెచ్ఓడి(యాక్టింగ్)పి.రాజారాం, డివైఎస్ఈ,కు మెమోరాండం అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఐఎన్టియుసి కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్, నాయకులు సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ముఖ్యంగా రుద్రంపూర్ ఫిల్టర్ బెడ్ నందు 75 హెచ్పి మోటర్ ఒకటి అదనంగా ఏర్పాటు చేయాలని, ఫిల్టర్ బెడ్ మెయిన్ గేట్ హైవే కి ఎదురుగా ఉండడంవల్ల ప్రమాదాలు అయ్యే అవకాశం ఎక్కువ ఉన్నందున పంప్ హౌస్ ఎదురుగా ఒక చిన్న గేట్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అంతేగాక పంప్ ఆపరేటర్లు లోపటికి రావడానికి బయటకు వెళ్లడానికి వీలుగా ఉంటుందిని సూచించారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదని,త్వరగా పెట్టించే ఏర్పాటు చేయాలన్నారు.5 ఇంక్లైన్ కోన్ వద్ద ఫెన్సింగ్ గేట్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.ఫెన్సింగ్ ఏర్పాటు చేసే వరకు ఒకరిని అదనంగా ఇచ్చే విధంగా చూడాలని వివరించారు. గౌతమ్ పూర్ ట్యాంకు వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వాటర్ ట్యాంక్ వద్ద డోజర్ తో చుట్టూ ఉన్న చెత్తను శుభ్రం చేసే విధంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఫిల్టర్ బెడ్ నందు ఓ.సి పంపు షెడ్ లొ చీకటి ఉండడం వల్ల ఇబ్బంది అవుతున్నదని కావున లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులకు మేలుకొంటున్న సమస్యలపై వారు స్పందిస్తూ జీ.ఎంతో మాట్లాడి పరిష్కారమయ్యే విధంగా చూస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఫిట్ కార్యదర్శి మల్లికార్జున్, ఎం. కొమరయ్య, లెనిన్ బాబు, దశరథ్, కొమరయ్య, భాను కమల్, విజయ్ కుమార్, రాజేందర్, పంపు ఆపరేటర్లు, వాల్వ్ ఆపరేటర్లు, నాయకులు, కార్యకర్తలు,మిత్రులు శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# హెలిప్యాడ్ నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి

## సీఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై అధికారులతో సమీక్షలో కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్,జూన్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి)** నూతన కలెక్టరేట్ భవనం వెనుక భాగంలో ఏర్పాటు చేయనున్న హెలిప్యాడ్ నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి,అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత అధికారు లను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్ నిర్మాణంపై సోమవారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్ లో ఏవియేషన్,పోలీసు,ఆర్ అండ్ బి,రెవెన్యూ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్ నిర్మాణ పనులపై అధికారుల తో చర్చించిన కలెక్టర్,భద్రతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. హెలిప్యాడ్ నిర్మాణానికి అనుకూలమైన స్థలాన్ని పరిశీలించినట్లు సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు.నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించా రు.సీఎం పర్యటనకు సంబం ధించిన అన్ని ఏర్పాట్లను శాఖల వారీగా సమీక్షిస్తూ పర్యటన విజయవంతం అయ్యేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి, డీఆర్వో స్వామి,ఏవియేషన్ అధికారి హరీష్,కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహాచారి తదితర అధికారులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరాలపై పోలీసుల మెరుపు దాడులు, 9 మంది అరెస్ట్



**హుస్నాబాద్:జూన్15 (తెలంగాణ వాణి రూరల్)** హుస్నాబాద్ మండలంలోని మాలపల్లి, పోతారం గ్రామాల్లో పేకాట ఆడుతున్న నిందితులపై పోలీసులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. హుస్నాబాద్ ఎస్సై పి. లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మాలపల్లి గ్రామంలో నలుగురు నిందితులను పట్టుకుని, వారి వద్ద నుంచి రూ. 18,340 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పోతారం గ్రామంలోని పేకాట స్థావరంపై దాడి నిర్వహించి ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 39,040 నగదు, ఐదు మొబైల్ ఫోన్లు, ఐదు ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఈ రెండు ఘటనలకు సంబంధించి మొత్తం తొమ్మిది మంది నిందితులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో పోలీస్ కానిస్టేబుళ్లు ఎన్. సంపత్,నరేష్,మహేందర్, సంజీవ్,శివకృష్ణలు పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధుల కుటుంబంలో మెరిసిన విద్యా కెరటం

## జాతీయస్థాయి ఎన్ఐటి ర్యాంకర్ మంద సాన్వి



తెలకపల్లి, జూన్ 15 (తెలంగాణ వాణి) దశాబ్దాలుగా ప్రజాసేవలో ప్రజా ప్రతినిధులుగా పేద ప్రజల ఎదుగుదల కోసం ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించిన మండల పరిధిలోని బండపల్లి గ్రామానికి చెందిన నాగర్ కర్నూల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, మాజీ సర్పంచులు మంద పర్వత రెడ్డి , మంద వినతమ్మ మనమరాలు, గ్రామ మాజీ సర్పంచ్



లు మంద సుఖ జీవన్ రెడ్డి, మంద ప్రవంతి కుమార్తె మంద సాన్వి శనివారం జాతీయ స్థాయిలో ఆన్లైన్ లో జోసా ద్వారా నిర్వహించిన కౌన్సిలింగ్ లో జాతీయస్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ విభాగంలో ప్రతిభ కనబరిచి ర్యాంకు పొందింది. జాతీయస్థాయిలో ఎన్ఐటిలో సీటు సాధించిన మంద సాన్వికి వారి కుటుంబ సభ్యులకు జిల్లా ప్రజా ప్రతినిధులు, మండల ప్రజా ప్రతినిధులు, సర్పంచులు అభినందనలు తెలిపారు. ఎన్ఐటి వరంగల్ లో ర్యాంకు సాధించిన మంద సాన్వి భవిష్యత్తులో విద్యాపరంగా అత్యున్నత స్థాయికి ఎదగాలని ఈ సందర్భంగా వారు కోరారు.

# ఘనంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు



**తల్లాడ, జూన్ 15 (తెలంగాణ వాణి)** : మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడుగునూరు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా గొడుగునూరు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అప్పటి తెలంగాణ రాష్ట్ర సాధనలోని తెలంగాణ రాష్ట్ర డిప్యూటి స్పీకర్గా భట్టి విక్రమార్క రాష్ట్ర ఏర్పాటులో తనదైన పాత్ర పోషించారు అన్నారు. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్ర పునర్ నిర్మాణంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఉప ముఖ్యమంత్రిగా ఆర్థిక శాఖ మంత్రిగా విద్యుత్ శాఖ మంత్రిగా తనదైన శైలిలోని ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్నారు అన్నారు. తెలంగాణ రాష్ట్రం అప్పులు ఊబిలో ఉన్నప్పటికీ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి , క్యాబినెట్ మంత్రుల సహాయంతో తనదైన శైలిలో తెలంగాణ రాష్ట్రంలోని సంక్షేమ పథకాలను పరిగెత్తిస్తున్నారు. బడ్జెట్లో ఖమ్మం జిల్లాకు ఎక్కువ నిధులు కేటాయించి జిల్లాను రాష్ట్రంలోని అగ్రగామి గా ఉండే విధంగా కృషి చేస్తున్నారన్నారు. జిల్లా మంత్రులు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహాయ సహకారాలతో సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్ట రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో సత్తుపల్లి మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని అల్లాడ మండల పార్టీ అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో అల్లాడ మండలం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రఘుపతి రెడ్డి, ఖమ్మం జిల్లా కమిటీ డిసిసి జనరల్ సెక్రెటరీ గోవిందు శ్రీనివాస రావు , జెడ్పిటిసి ముకరా ప్రసాద్ , కంచపోగు వెంకటేశ్వర్లు, వెంకటగిరి సర్పంచ్ దీవెల వెంకటేశ్వరరావు, దిరిశాల నరసింహారావు, మారెళ్ల మల్లికార్జునరావు, తుమ్మలపల్లి రమేష్ ,, తాళ్ల జోసెఫ్,సామినేని రామ అప్పారావు, దుండేటి వీరారెడ్డి , షేక్ ఇమామ్ సాహెబ్, వెంకట నారాయణ రెడ్డి, పొట్టేటి జనార్ధన్ రెడ్డి, తాళ్ల వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్, వేమిశెట్టి నాగన్న , కోసూరి వెంకటేశ్వర్లు కేవీ,, రావుల గోపి గౌడ్,కటికె కిరణ్ , మల్లవరం సర్పంచ్, భూక్యా అంజయ్య ఎస్టీ సెల్ తల్లాడ, నాగేశ్వరరావు , అన్నేం కోటి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు భట్టి విక్రమార్క టిపిసిసి సభ్యులు జేబీ శౌరి

## డీసీసీ కార్యాలయంలో భట్టి జన్మదిన వేడుకలు




**కొత్తగూడెం, జూన్ 15 (తెలంగాణ వాణి)** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ప్రజానాయకుడు, నిరంతర ప్రజా పోరాట యోధుడు భట్టి విక్రమార్క మల్లు జన్మదినాన్ని పురస్కరించుకొని కొత్తగూడెం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీ.పీ.సీ.సీ సభ్యులు జేబీ శౌరి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి భట్టి విక్రమార్కకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా జేబీ శౌరి మాట్లాడుతూ, సాధారణ కుటుంబం నుంచి రాజకీయాల్లోకి అడుగుపెట్టి తన కృషి, నిజాయితీ, ప్రజాసేవ పట్ల అంకితభావంతో తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నాయకుడు భట్టి విక్రమార్క అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి నాలుగు దశాబ్దాలకుపైగా ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని తెలిపారు.ఖమ్మం జిల్లాలోని గాంధీ భావజాలాన్ని ఆచరిస్తూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించిన భట్టి విక్రమార్క ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా, శాసనసభలో కాంగ్రెస్ పక్ష నేతగా, సీఎల్పీ నాయకుడిగా అనేక కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన ఎల్లప్పుడూ ముందుండేవారని అన్నారు. ప్రత్యేకించి తెలంగాణ రాజకీయ చరిత్రలో మైలురాయిగా నిలిచిన “పీపుల్స్ మార్చ్ పాదయాత్ర” ద్వారా రాష్ట్రంలోని గ్రామాలు, రైతులు, యువత, మహిళలు, కార్మికులు, నిరుద్యోగుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేసిన నాయకుడు భట్టి విక్రమార్క అని తెలిపారు. వేల కిలోమీటర్లు నడిచి ప్రజల బాధలను అర్థం చేసుకొని వారి స్వరాన్ని ప్రభుత్వాలకు వినిపించిన ప్రజా నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రజల పట్ల ఆయనకున్న అంకితభావం, క్రమశిక్షణ, నిరాడంబర జీవనశైలి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు.తెలంగాణ అభివృద్ధి, సామాజిక న్యాయం, పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న భట్టి విక్రమార్క సంపూర్ణఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలుతెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోతుకూరి ధర్మారావు, జిల్లా కిసాన్ సెల్ చైర్మన్ ఏలూరి కోటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు బిక్కసాని నాగేశ్వరరావు, మాజీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి రజాక్,నగర కాంగ్రెస్ కన్వీనర్ ఎండి గౌస్ మోహినుద్దీన్, ఓబీసీ జిల్లా చైర్మన్ అల్లాడి నరసింహారావు, ఎన్ ఎస్ యు ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు అజ్మీర సురేష్ నాయక్, సోషల్ మీడియా ఖమ్మం పార్లమెంట్ ఇంచార్జ్ వీరాపురం రామ్ లక్ష్మణ్, సేవాలాల్ నియోజకవర్గ అధ్యక్షులు పోరేటి నరేష్, మాజీ ఎంపిటిసి కసనబోయిన భద్రం, మాజీ కో ఆప్షన్ నెంబర్ ఆరిఫ్ ఖాన్,యువజన కాంగ్రెస్ టౌన్ ఉపాధ్యక్షుడు ఉస్మాన్ అలీ ఖాన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు లాల్ సింగ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ ఏలూరి రాందాస్, నాయకులు గాండ్ల సురేష్, పెగడ బిక్షపతి, కొమరయ్య, నరసింహారావు, నిరంజన్ రెడ్డి, వాగబోయిన రాము,యువజన నాయకులు నయీమ్, తదితరులు పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణ కార్పొరేషన్‌కు పాలకమండలిని ఏర్పాటు చేయాలి: వేముల భిక్షం

యాదాద్రి/భువనగిరి:రామన్నపేట జూన్15 (తెలంగాణ వాణి ప్రతినిధి) రామన్నపేట నాయి బ్రాహ్మణ కార్పొరేషన్‌కు వెంటనే పాలకమండలిని ఏర్పాటు చేసి, చైర్మన్ పదవిని నాయి బ్రాహ్మణులకే కేటాయించాలని ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల భిక్షం డిమాండ్ చేశారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది.?ఈ సందర్భంగా వేముల భిక్షం మాట్లాడుతూ.. ప్రాచీన కాలం నుండి సమాజంలో ఎనలేని సేవలందిస్తున్న



నాయి బ్రాహ్మణులు నేటికీ పేదరికంలోనే మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సెలూన్లు రంగ ప్రవేశం చేసి తమ వృత్తిని దెబ్బతీస్తున్నాయని, ప్రభుత్వం తమకు ఆధునిక పరికరాలు అందించి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ?నాయి బ్రాహ్మణ ఫెడరేషన్‌కు తక్షణమే పాలకమండలిని ఏర్పాటు చేయాలని, 50 సంవత్సరాలు నిండిన వృత్తిదారులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే నాయి బ్రాహ్మణులకు కూడా ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని, వివిధ దేవస్థానాల కల్యాణకట్టల్లో పనిచేస్తున్న క్షురకులను పర్మినెంట్ చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, ఆసుపత్రులు, పోలీస్ శాఖల్లో ఖాళీగా ఉన్న బార్బర్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు, ఉచిత విద్యుత్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఇల్లే లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.?ఈ సమావేశంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం మండల అధ్యక్షులు రాపర్తి గణేష్, ఉపాధ్యక్షుడు దడిపెల్లి గణేష్, కోశాధికారి వావిళ్ళ సంతోష్,నాయకులు వేముల అశోక్, రాసమల్ల శ్రీకాంత్, జంపాల మురళి, మహేష్, దశరథ, నాగరాజు, నరేష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా నూతన విద్యాసంవత్సర ప్రారంభోత్సవ వేడుకలు




మేడిపల్లి/బోడుప్పల్:జూన్ 15 (తెలంగాణ వాణి రిపోర్టర్) మేడిపల్లి,పరిధిలోని శ్రీ చైతన్య పాఠశాలలో 2026-27 నూతన విద్యాసంవత్సరం ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల పునఃప్రారంభమైన తొలిరోజు విద్యార్థులకు యాజమాన్యం, ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నారాయణగూడ జోన్ ఏజీఎం నూర్ మహ్మద్ అలీ మాట్లాడుతూ.. విద్యార్థులు ఒత్తిడి లేని చదువులపై దృష్టి పెట్టాలని




పిలుపునిచ్చారు.నిత్యం ఉత్సాహంతో ఉరకలు వేస్తూ,భవిష్యత్తుకు చక్కని బాటలు వేసుకోవాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.?అదేవిధంగా విద్యాసంస్థల,కోఆర్డినేటర్ రాజేంద్రప్రసాద్,ఆర్ఐ వెంకటేష్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి మాలతిరెడ్డి,డీన్ మధుకర్ మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.నూతన విద్యాసంవత్సరంలో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల ఉత్సాహభరిత వాతావరణం నడుమ ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం అత్యంత జయప్రదంగా ముగిసింది.